సాక్షి
అనంతపురం

బుధవారం । 29 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.




టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 పలికింది.

గరిష్టం/కనిష్టం
41.7°/ 18.3°

జిల్లా అంతటా మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.





● ఇంటికి పయనం

ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మంగళవారం ముగిశాయి. అనంతపురంలోని హాస్టళ్లు, రెసిడెన్షియళ్లు, రూములల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు పరీక్షలు ముగియడంతో ఇళ్లకు పయనమయ్యారు. చాలామంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి లగేజీ సర్దుకుని ఆర్టీసీ బస్సుల్లో స్వస్థలాలకు వెళ్లారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





న్యూస్‌రీల్

నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.43.10 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.43.10 లక్షల ఆదాయం లభించినట్లు ఈఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. భక్తులు స్వామివారికి సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు మంగళవారం ఆలయంలో చేపట్టారు. 49 రోజులకు గానూ రూ.43,10,744 నగదు, అదేవిధంగా అన్నదాన హుండీ ద్వారా రూ.52,260 నగదును భక్తులు సమర్పించినట్లు తెలిపారు. 0.004 గ్రాముల బంగారు, 1.309 కిలోల వెండిని కానుకల రూపంలో స్వామికి సమర్పించినట్లు పేర్కొన్నారు. పాలకమండలి చైర్‌పర్సన్ సుగుణమ్మ, ఆలయ అధికారులు తదితరులు హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నిందితులపై నిఘా పెంచండి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మాదకద్రవ్యాల (డ్రగ్స్) కేసుల్లోని నిందితులపై నిఘా పెంచాలని ఎస్పీ ఫక్కీరప్ప పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లాలోని ఎస్‌ఐ, ఆపై స్థాయి పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మాదకద్రవ్యాల కేసులపై సమీక్షించారు. జిల్లాలో 2021 సంవత్సరం నుంచి నమోదైన కేసుల్లో ఉన్న నిందితులను మెయిన్ అఫెండర్స్, పెడ్లర్స్, కంజ్యూమర్స్ కేటగిరీలుగా విభజించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కీలక నిందితులపై కచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల రవాణాలో ఆరి తేరిన వారిని గుర్తించి ఆటకట్టించాలని పిలుపునిచ్చారు. గంజాయి, తదితర మాదక ద్రవ్యాలను స్థానికంగా అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు ఆయా పోలీసు కార్యాలయాలు, పోలీసు స్టేషన్ల నుంచి పాల్గొన్నారు.

అరిసికెరకు సమ్మర్ స్పెషల్ రైళ్లు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అరిసికెరకు సమ్మర్ స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ అఫీసర్ సీహెచ్ రాకేష్ మంగళవారం మీడియాకు తెలిపారు. సికింద్రాబాద్ – అరిసికెర (07233/34) స్పెషల్ రైళ్లు మార్చి 30 నుంచి జూన్ 30 వరకు శుక్ర, శనివారాల్లో రాకపోకలు సాగిస్తాయని వెల్లడించారు. కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, గద్వాల, రాయచూర్, గుంతకల్లు, ఆదోని, అనంతపురం, ధర్మవరం, యలహంక మీదుగా అరిసికెరకు చేరుతుందన్నారు. అలాగే హైదరాబాద్ – అరిసికెర (07265/66) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఏప్రిల్ 4 నుంచి జూన్ 28 వరకు ప్రతి మంగళ, బుధవారాల్లో రాకపోకలు ఉంటాయని తెలిపారు. ఈ రైలు సికింద్రాబాద్, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, గద్వాల్, కర్నూలు సిటీ, డోన్, అనంతపురం, ధర్మవరం, యలహంక, తుమకూరు మీదుగా అరిసికెరకు చేరుతుందన్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

రాప్తాడురూరల్: ఇంటర్మీడియెట్ ఫస్టియర్ (జనరల్) పరీక్షలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు కామర్స్, కెమిస్ట్రీ పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో 929 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 31,198 మంది విద్యార్థులకు గాను 30,269 మంది పరీక్షలు రాశారు. వీరిలో జనరల్ విద్యార్థులు 28,890 మందికి గాను 28,098 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,308 మందికి గాను 2,171 మంది హాజరైన వారిలో ఉన్నారు. ఒకేషనల్ విద్యార్థులకు ఏప్రిల్ 4 వరకు పరీక్షలు ఉంటాయి.

పన్నులకు చిల్లు

- బిజినెస్ తక్కువ చూపించిన డీలర్లు
- సహకరించిన జీఎస్టీ అధికారులు
- గడువు దాటినా రిటర్న్‌లకు అనుమతి
- అనంతపురం–2 సర్కిల్‌లో మోసాలు
- ప్రభుత్వాదాయానికి భారీ స్థాయిలో గండి
- కాగ్ రిపోర్ట్‌తో బయటపడిన అధికారుల డొల్లతనం

పన్నుల చెల్లింపులో గోల్‌మాల్ జరుగుతోంది. జీఎస్టీ అధికారుల సాయంతో ఎంతోమంది వ్యాపారులు పన్నులు ఎగ్గొడుతున్నారు. భారీగా వ్యాపారం జరిగినా తక్కువగా జరిగినట్లు చూపి ఆ మేరకు పన్ను కట్టి.. ప్రభుత్వాదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఓవైపు జీరో బిజినెస్ (ఎలాంటి బిల్లులు లేకుండా వ్యాపారం) చేయడం, మరోవైపు చేస్తున్న వ్యాపారానికి పన్నులు చెల్లించకపోవడంలో జీఎస్టీ అధికారుల డొల్లతనం బయటపడింది. తాజాగా కాగ్ రిపోర్టులో అనంతపురం జిల్లా అధికారుల వైఫల్యం కనిపించింది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఐరన్, మినరల్స్, గ్రానైట్, హోటళ్లు, హోల్‌సేల్ వంటి పలు వ్యాపారాలు చేసేవారు పన్నుల చెల్లింపులో అవకతవకలకు పాల్పడినట్టు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) 2022–23 బడ్జెట్ సందర్భంగా సమర్పించిన నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా అనంతపురం–2 సర్కిల్‌లో ఎక్కువగా జరిగినట్టు తేలింది. ఏపీ వ్యాట్ చట్టం 2005 ప్రకారం ఎవరైనా డీలరు పన్ను తక్కువగా చూపితే దానికి తగ్గట్టు జరిమానా విధించాలి. అంతేకాదు, డీలరు ఉద్దేశపూర్వకంగా పన్నును తక్కువగా చూపిస్తే దానికి 100 శాతం జరిమానా అధికంగా వేయాలి. డీలరు ఐటీసీ (ఇన్‌పుట్ క్రెడిట్ ట్యాక్స్) తీసుకోవడానికి నకిలీ లేదా తప్పుడు ఇన్‌వాయిస్‌లను జారీచేస్తే పన్నులో 200 శాతం జరిమానా విధించాలి.

గండి కొడుతున్నారిలా..

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వెయ్యికి పైగా హోటళ్లు, 240 వరకు గ్రానైట్ హోల్‌సేల్ షాపులు, వస్త్రదుకాణాలు, ఇతర హోల్‌సేల్ వ్యాపార సముదాయాలు 800, స్టీల్, సిమెంటు, ఐరన్ వంటి ఏజెన్సీలు మరో 200 వరకూ ఉన్నాయి. 32వేల వరకు జీఎస్టీ ట్రేడ్ నంబర్లు నమోదై ఉన్నాయి. ఈ మేరకు ఏటా జిల్లాలో రూ.130 కోట్ల వరకూ పన్నులు వసూలు కావాలి. కానీ రూ.90 కోట్ల వరకూ అవుతోంది. వ్యాపారులతో అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టినట్టు స్పష్టమైంది.

కొన్ని నిదర్శనాలు..

- అనంతపురం అర్బన్‌లో ఒక హోటల్‌కు గతంలో ఉన్న ఒక అధికారి రూ.1.27 కోట్ల పెనాల్టీ వేస్తే.. దాన్ని ప్రస్తుత అధికారులు రూ.25 లక్షలకు కుదించేశారు.
- అనంతపురం శివారులోని కళ్యాణదుర్గం రోడ్డులో గల ఓ గ్రానైట్ వ్యాపారి తన బిజినెస్‌ను తక్కువగా చూపించి అత్యల్పంగా పన్ను కట్టారు.
- జీరో బిజినెస్ అంటే అధికారులు సరిగా పన్నులు వేయని కారణంగా ఏటా రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్ల వరకూ ప్రభుత్వాదాయానికి గండి పడుతున్నట్టు అంచనా.

జిల్లాలో తప్పుల తడకగా వసూళ్లు

- సెక్షన్ 53(3) ప్రకారం ఉద్దేశపూర్వకంగా ఔట్‌పుట్ పన్ను తక్కువగా చూపించడం, ఇన్‌పుట్ క్రెడిట్ ట్యాక్స్ ఎక్కువగా వెల్లడించడం చేశారు.
- అనంతపురం సర్కిల్–2 పరిధిలో ఇలాంటి కేసులు మచ్చుకు కొన్ని ఆడిట్ అధికారులు పరిశీలించగా.. అత్యల్పంగా డీలర్లు పన్నులు చెల్లించినట్టు తేలింది.
- పన్ను రిటర్న్‌లకు ఫలానా తేదీలోగా చెల్లించాలని కాలవ్యవధి నిర్ణయిస్తారు. కానీ గడువులోగా రిటర్న్‌లు సమర్పించకపోతే సెక్షన్ 50 ప్రకారం 15 శాతం జరిమానా విధించాలి. కానీ ఇక్కడి అధికారులు 0.05 శాతం మాత్రమే వసూలు చేశారు. దీన్నిబట్టి అధికారులు, డీలర్లు లాలూచీ పడినట్టు రూఢీ అవుతోంది.



అనంతపురంలోని జీఎస్టీ కార్యాలయం

నోటీసులు ఇస్తున్నాం

కొన్ని కొన్ని ఇష్యూలు రొటీన్‌గా వచ్చేవే. మా దృష్టికి వచ్చినప్పుడు వెంటనే విచారణ చేసి నోటీసులు ఇస్తాం. వారికి ఫైన్‌లు వేస్తాం.

– నీరజ, జాయింట్ కమిషనర్, జీఎస్టీ

- నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించి చాలామంది ఐటీసీ (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) తప్పుగా క్లెయిమ్ చేశారు. దీనికి సెక్షన్ 55(2) ప్రకారం 200 శాతం జరిమానా విధించాలి. కానీ ఇక్కడ తక్కువ జరిమానా విధించడం వల్ల రూ.12 లక్షలు మాత్రమే వసూలైంది. వాస్తవానికి రూ.2 కోట్ల పైన వసూలు కావాల్సి ఉంది.
- తప్పుడు లేదా నకిలీ డిక్లరేషన్‌లు సమర్పించిన వారికి సెక్షన్ 55(4) (బీ) ప్రకారం 200 శాతం జరిమానా విధించాలి. కానీ ఇక్కడ అత్యల్పంగా విధించినట్టు తేలింది.
- ఒక సర్కిల్‌లోనే ఇంత పెద్దమొత్తంలో అవకతవకలు వెలుగు చూశాయంటే.. ఆరు సర్కిళ్లలోనూ భారీగా మోసాలు జరిగి ఉంటాయని అంచనా వేస్తున్నారు.

డీసీఎంఎస్ ద్వారా రైతులకు విశిష్ట సేవలు



మహాజన సభలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ద్వారా రైతులకు విశిష్ట సేవలందిస్తున్నామని చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డీసీఎంఎస్ కార్యాలయంలో బిజినెస్ మేనేజర్ టి.విజయభాస్కర్ అధ్యక్షతన 79వ వార్షిక మహాజన సభ నిర్వహించారు. చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం, కదిరి, పెనుకొండ, హిందూపురం డీసీఎంఎస్ సేల్స్ పాయింట్స్ ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అమ్మకాలు సాగిస్తున్నామన్నారు. పురుగు మందుల అమ్మకాలు, పప్పుశనగ కొనుగోళ్లు కూడా చేస్తున్నట్లు వెల్లడించారు. ఎరువుల అమ్మకాల ద్వారానే ఈ ఏడాది రూ.8.83 కోట్లు, మిగతా వాటి ద్వారా మరో రూ.3 కోట్ల లావాదేవీలు జరిగాయని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ముమ్ముందు రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్లు శ్రీరామరెడ్డి, జగదీష్‌చౌదరి, జబీవుల్లా, నాగమ్మ, హెచ్.కిష్టప్ప, ఎంజీ సుమంగళమ్మ, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, అకౌంట్స్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వగురు భారత్!

- జేఎన్‌టీయూఏ వీసీ రంగజనార్దన ఆశాభావం
- అట్టహాసంగా ఇంజినీరింగ్ కళాశాల 76వ వార్షికోత్సవం
- క్రీడల్లో ప్రతిభ చాటే వారికి నెలకు రూ.10 వేల ఉపకారవేతనం





క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: మానవ వనరులు అపారంగా ఉండి జాతి పురోగతికి విశేషంగా కృషి చేస్తున్న యువశక్తిశీల దేశంగా భారత్ విరాజిల్లుతోందని జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల 76వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్పోర్ట్స్‌డే నిర్వహించారు. అంతకుముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి వీసీ మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటి స్వర్ణం, రజతం, కాంస్య పతకాలు గెలుపొందే విద్యార్థులకు రూ.25 వేలు ప్రోత్సాహక బహుమతితో పాటు నెలకు రూ.10 వేల ఉపకారవేతనం అందిస్తామన్నారు. 2047 నాటికి భారత్ అగ్రరాజ్యంగా ఏర్పడి విశ్వగురుగా గుర్తింపు దక్కుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ, దక్షిణ భారత అంతర్ వర్సిటీ స్థాయి పోటీల్లో గత విద్యా సంవత్సరంలో 25 మంది విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటారన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ మాట్లాడుతూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్నిచోట్లా జేఎన్‌టీయూ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటారన్నారు. క్రీడలను కెరీర్‌గా ఎంచుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. స్పోర్ట్స్ సెక్రెటరీ డాక్టర్ జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. భవానీ, జనరల్ కెప్టెన్ అమృతరాజ్ పాల్గొన్నారు.

సామాజిక ఆవిష్కరణలు కావాలి

ఇంజినీర్లు సమాజానికి దోహదపడే ఆవిష్కరణలు చేపట్టాలని జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన సూచించారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల 76వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తొలిసారిగా టెక్ ఫెస్ట్–2కే23 నిర్వహించారు. సివిల్ ఇంజినీరింగ్‌లో రేస్ 2కే23, ఎలక్ట్రికల్ విభాగం ఐ–2కే23, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం డైనమిక్స్ 2కే23, ఎలక్ట్రానిక్స్ విభాగం ఈ–మెర్జ్2కే23, కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగంలో పిక్సెల్ 2కే23, కెమికల్ ఇంజినీరింగ్ విభాగం ఫ్యూషన్2కే23 సదస్సులు నిర్వహించారు. సదస్సులకు ముఖ్య అతిథిగా వీసీ హాజరై మాట్లాడారు. టెక్‌ఫెస్ట్–23 సదస్సుల ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. సమస్యలను పరిష్కరించే రీతిలో నూతన అంశాలు తెలుసుకోవడానికి ఇలాంటి వేదిక దోహదపడుతుందన్నారు. విశిష్ట అతిథి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ మాట్లాడుతూ భవిష్యత్తులో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం అనివార్యమని స్పష్టం చేశారు. ఇలాంటి అంశాలపై నూతన ఆవిష్కరణలు చేయాలని కోరారు. అనంతరం వివిధ విభాగాల్లో సావనీర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.భవాని తదితరులు పాల్గొన్నారు.

ఎవరికీ మినహాయింపు లేదు

- నియమించిన వారంతా విధులకు రావాల్సిందే
- పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం : డీఈఓ ఎం.సాయిరామ్



మాట్లాడుతున్న డీఈఓ ఎం.సాయిరామ్

రాప్తాడురూరల్: పదో తరగతి పరీక్షల నిర్వహణ విధులకు నియమించిన ఏ ఒక్కరికీ మినహాయింపు ఉండదని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎం.సాయిరామ్ తెలిపారు. నియమించిన వారంతా విధిగా విధులకు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశామని చెప్పారు. మంగళవారం అనంతపురంలోని కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్‌తో కలిసి డీఈఓ మీడియాతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 35,305 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతారన్నారు. వీరిలో 18,906 మంది బాలురు, 16,399 మంది బాలికలు ఉన్నారన్నారు. ప్రైవేట్ విద్యార్థులు 5,375 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,328 మంది ఉన్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 139 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో 79, ప్రైవేట్‌స్కూళ్లలో 60 కేంద్రాలు ఉన్నాయన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారుల నియామకం ఇప్పటికే పూర్తయిందన్నారు. వారికి శిక్షణ కూడా ఇచ్చామన్నారు. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. వారికి సీఎస్, డీఓలు శిక్షణ ఇస్తారన్నారు. గతేడాది పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చోట్ల సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేస్తామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఏ స్థాయి అధికారికీ మొబైల్ అనుమతి ఉండదని తెలిపారు. అన్ని కేంద్రాల్లోనూ తాగునీరు, నీటి వసతి కల్గిన మరుగుదొడ్లు, ఫర్నీచరు, కరెంటు సదుపాయం ఉండేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. అందరూ సమన్వయంతో పని చేసి జిల్లాలో ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా చూడాలని కోరారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

పరీక్షల కోసం అనంతపురం కేఎస్‌ఆర్ బాలికల పాఠశాలలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామని డీఈఓ తెలిపారు. ఈ కంట్రోల్ రూం 24 గంటలూ అందుబాటులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఏ చిన్న సమస్య ఉన్నా 86391 85929, 86399 31155 నంబర్లకు ఫిర్యాదు చేయొచ్చన్నారు.

ఆ సాగు పట్టాలు చెల్లవు

- వాటికి అసైన్డ్‌మెంట్ కమిటీ ఆమోదం లేదు
- అనంతపురం మండలం కొడిమి పొలంలోనే 40.80 ఎకరాల గుర్తింపు
- ఆ పట్టాలనీ రద్దు చేసి స్థలాలను జగనన్న ఇళ్లకు తీసుకున్న ప్రభుత్వం

రాప్తాడురూరల్: అసైన్డ్‌మెంట్ కమిటీ ఆమోదంతో పొందిన సాగు పట్టాలకే విలువ ఉంటుంది. అలా కాకుండా గత తెలుగుదేశం ప్రభుత్వంలో కొందరు ఇబ్బడిముబ్బడిగా సాగు పట్టాలు పొందారు. అందులోనూ అనంతపురం రూరల్ మండలంలో విలువైన భూములకు ఎసరు పెట్టారు. మాజీమంత్రి పరిటాల సునీత తన అనుచరులు, కార్యకర్తలు, అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టారు. ఒక్క కొడిమి పొలంలోనే 40.80 ఎకరాలను రెవెన్యూ అధికారులు గుర్తించారు. 2013 జూన్‌లో చివరి అసైన్డ్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఇవన్నీ కూడా అసైన్డ్‌మెంట్ కమిటీ తర్వాత పట్టాలిచ్చినవే. కమిటీ ఆమోదం లేకుండా పొందిన సాగు పట్టాలను తాజాగా ప్రభుత్వం రద్దు చేసింది. ఈ భూములను అనంతపురం అర్బన్, రూరల్ పరిధిలోని పేదలకు జగనన్న ఇళ్ల కోసం కేటాయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వెనక్కు తీసుకుంటున్న భూముల వివరాలు ...

కొడిమి పొలం 98–4 సర్వే నంబర్‌లో 2.50 ఎకరాలు, 98–5లో 1.37 ఎకరాలు, 98–2ఏలో 1.56 ఎకరాలు, 136లో 2.30 ఎకరాలు, 136లో 1.79 ఎకరాలు, 136లో 2.68 ఎకరాలు, 149–2లో 4.34 ఎకరాలు, 149–3లో 3.20 ఎకరాలు, 98–3లో 0.64 ఎకరాలు, 98–5లో 1.37 ఎకరాలు, 98–1లో 2 ఎకరాలు, 136లో 4.37 ఎకరాలు, 136లో 3.93 ఎకరాలు, 98–1లో 1.75 ఎకరాలు, 98–1లో 7 ఎకరాలు కలిపి మొత్తం 40.80 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కు తీసుకుంది.

పంటలకు మాత్రమే పరిహారం

ఈ మొత్తం భూములకు సంబంధించి ఒక్క పైసా కూడా పరిహారం ఇవ్వరు. అందులో సాగు చేస్తున్న పంటలకు మాత్రమే పరిహారం చెల్లిస్తున్నారు. ఇప్పటికే హార్టికల్చర్ అధికారులు అంచనాలు తయారు చేశారన్నారు. తహసీల్దార్ శ్రీధరమూర్తి మాట్లాడుతూ అసైన్డ్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండా ఇచ్చిన పట్టాలు చట్టం దృష్టిలో చెల్లవన్నారు. ఇప్పుడు భూములు స్వాధీనం చేసుకుంటున్నామన్నారు.

కోవిడ్‌పై సమరానికి సిద్ధం

- కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తం
- ప్రభుత్వ సర్వజనాస్పత్రి, 'సూపర్ స్పెషాలిటీ'లో ఏర్పాట్లు



అనంతపురం సప్తగిరి సర్కిల్: కోవిడ్ మరోసారి అలజడి రేపుతోంది. దేశంలో ఒక్కసారిగా పాజిటివ్ కేసుల్లో పెరుగుదల కనిపించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లా అధికార యంత్రాంగం కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు అప్రమత్తమైంది. అనంతపురం శివారు ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తికి పాజిటివ్ రావడంతో అతనిని ప్రస్తుతం పూర్తిస్థాయి పర్యవేక్షణలో ఉంచారు.

ప్రత్యేక బెడ్ల ఏర్పాటు

అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఐడీ వార్డులో కోవిడ్ రోగుల కోసం ప్రత్యేకంగా 20 బెడ్లు సిద్ధం చేశారు. ఇందులో 5 బెడ్లు ప్రత్యేకమైన వసతుల (హై ఫ్లో ఆక్సిజన్)తో ఏర్పాటు చేశారు. వీటితోపాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మరో 200 బెడ్లను ప్రత్యేకంగా సిద్ధం చేశారు. కేసుల తీవ్రత పెరిగినా ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉన్నామని అధికారులు తెలిపారు.

గత నవంబర్‌లో ఒక కేసు..

జిల్లాలో గతేడాది నవంబర్‌లో ఒక కోవిడ్ కేసు నమోదైనట్లు అధికార యంత్రాంగం వెల్లడించింది. సదరు కేసుకు సంబంధించి తీవ్రత, వ్యాప్తి కూడా పూర్తిగా లేకపోవడంతో అనుమానిత వ్యక్తికి పూర్తిస్థాయిలో వైద్యాన్ని అందించి డిశ్చార్జ్ చేశారు. తాజాగా నమోదైన కేసు కూడా వచ్చి వారం రోజులు దాటినందున ఎలాంటి భయాందోళనలూ చెందాల్సిన అవసరం లేదని వైద్యాధికారులు చెబుతున్నారు.

పూర్తిస్థాయిలో ఆక్సిజన్ ప్లాంట్లు

కోవిడ్ రోగుల కోసం మూడు ఆక్సిజన్ ప్లాంట్లను సిద్ధం చేశారు. సర్వజనాస్పత్రి ప్రాంగణంలో 13 కేఎల్ సామర్థ్యం కలిగిన ఆక్సిజన్ ప్లాంట్‌లో ప్రస్తుతం 9 కేఎల్, 10 కేఎల్ సామర్థ్యం కలిగిన మరో ప్లాంట్‌లో 4.7 కే ఎల్ లిక్విడ్ ఆక్సిజన్ అందుబాటులో ఉంది. వీటితో పాటు అదనంగా ఎన్విరాన్‌మెంటల్ ఆక్సిజన్ ప్లాంట్ కూడా సిద్ధంగా ఉంది.

అప్రమత్తంగా ఉన్నాం

కోవిడ్ రోగులకు చికిత్స అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశాం. బెడ్లు, ఆక్సిజన్, వెంటిలేటర్లను సిద్ధంగా ఉంచాం. సిబ్బందిని ఆయా పరిస్థితుల దృష్ట్యా నియమించేందుకు ఏర్పాట్లు చేస్తాం. ప్రస్తుతం కోవిడ్ తీవ్రత, వ్యాప్తి లేనందున భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదు. పూర్తి అప్రమత్తంగానే ఉన్నాం.

– డాక్టర్ రఘునందన్, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్, అనంతపురం

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుత్తి: పట్టణంలోని లచ్చాన పల్లి రోడ్డులో ఉన్న నిరాశ్రయుల భవనం వద్ద మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వ్యక్తి వివరాలు తెలిస్తే సంప్రదించాలని పోలీసులు సూచించారు.

హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు

పావగడ: వైఎన్ హొసకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రబెట్ట సమీపంలో ఈ నెల 13న వెలుగుచూసిన ఓ వ్యక్తి హత్య కేసులో ఇప్పటికే ఓ నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు మరో ఇద్దరిని మంగళవారం అరెస్టు చేశారు. వివరాలను వైఎన్ హొసకోట రూరల్ సీఐ కాంతరెడ్డి విలేకరులకు వెల్లడించారు. పథకం ప్రకారమే హత్యకు పాల్పడ్డారని తెలిపారు. హతుడు రామాంజి, నిందితులు కావేరి, చిట్టెమ్మ, రవి సంఘటన ఘటన జరిగిన రాత్రి మహంతపురం నుంచి వైఎన్ హొసకోటకు చేరుకున్నారన్నారు. అక్కడ రామాంజికి పూటుగా మద్యం తాగించి బైకులో ఇంద్రబెట్టకు చేర్చారని తెలిపారు. అనంతరం రవి వైఎన్ హొసకోటకు వెళ్లి కావేరి, చిట్టెమ్మను బైకులో ఇంద్రబెట్టకు తీసుకొచ్చాడు. వారి పిల్లల్ని మణి అనే మహిళ వద్ద ఉంచారు. నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లి మళ్లీ రామాంజికి మద్యం తాగించారు. మత్తులో ఉన్న రామాంజి కాళ్లు, చేతుల్ని భార్య కావేరి, ఆమె చెల్లెలు చిట్టెమ్మ గట్టిగా పట్టుకోగా రవి పదునైన కత్తితో రామాంజి గొంతు కోశాడు. అనంతరం మృతదేహాన్ని గుర్తు పట్టకుండా బైకులోని పెట్రోలుతో కాల్చి వేసి నిందితులు పరారయ్యారని సీఐ తెలిపారు.

రైలు ఢీకొని గార్మెంట్స్ కార్మికుడి మృతి



మృతి చెందిన శ్రీనివాసులు

రాయదుర్గంటౌన్: రైలు ఢీకొని ఓ గార్మెంట్స్ కార్మికుడు మృతి చెందిన ఘటన సోమవారం అర్ధరాత్రి రాయదుర్గం రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన మేరకు.. పట్టణంలోని చౌడమ్మగుడి ఏరియాలో శ్రీనివాసులు(38), స్రవంతి దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. గార్మెంట్స్ కార్మికుడిగా పనిచేస్తున్న శ్రీనివాసులు మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి అతిగా మద్యం సేవించి ఇంటికి వస్తూ రైల్వే పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో ఆయన కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన రైల్వే పోలీసులు రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై గుంతకల్లు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

‘పది’పై పట్టు సాధిస్తారా?



హంపాపురం బీసీ వసతి గృహంలో విద్యార్థులు

- ప్రభుత్వ వసతి గృహాల్లో ఏటా తగ్గుతున్న ఉత్తీర్ణత శాతం
- వార్డెన్ల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు

అనంతపురం రూరల్: వసతి గృహాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోంది. నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా రూ. కోట్లు ఖర్చు చేస్తోంది. పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని ప్రత్యేకంగా ట్యూటర్లను సైతం నియమించింది. నెలకు ఒక్కో సబ్జక్టుకు రూ. 1,500 చెల్లిస్తోంది.

వార్డెన్ల నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం

ప్రభుత్వం ఇంత చేస్తున్నా కొంతమంది అధికారులు సర్కారు ఆశయాలను తుంగలో తొక్కుతున్నారు. పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. విద్యార్థులు ఎలా పోతే మాకేంటి, మమ్మల్ని అడిగే వారెవరన్నట్లు వ్యవహరిస్తున్నారు. గతేడాది వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు సాధించిన ఉత్తీర్ణత శాతంలో అనంతపురం జిల్లా ఆఖరు స్థానంలో నిలిచింది. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ సారైనా అప్రమత్తంగా ఉంటున్నారా అంటే లేదనే సమాధానమే వస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం పెంచాల్సిందేనని ఉన్నతాధికారులు పదే పదే చెబుతున్నా చాలామంది వార్డెన్లు ఆదేశాలను బేఖాతరు చేస్తూనే ఉన్నారు. పరీక్షలు సమీపిస్తున్నా చాలా హాస్టళ్లలో స్టడీ అవర్స్ నిర్వహించడం లేదు. నిబంధనల ప్రకారం వార్డెన్లు స్థానికంగా ఉండటంతో పాటు ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ, సాయంత్రం 6 నుంచి రాత్రి 9 వరకూ హాస్టల్‌లోనే ఉండి స్టడీ అవర్స్ నిర్వహిస్తూ విద్యార్థులను పర్యవేక్షించాల్సి ఉన్నా చాలా మంది డుమ్మా కొడుతున్నారు. హాస్టళ్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ పర్యవేక్షించాల్సిన ఏబీసీడబ్ల్యూఓలు, ఏఎస్‌డబ్ల్యూఓలు వార్డెన్లు ఇచ్చే నెలవారీ మామూళ్లకు అలవాటు పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో హాస్టళ్లు, విద్యార్థుల వివరాలిలా..		
బీసీ సంక్షేమ శాఖ	36	572
సాంఘిక సంక్షేమ శాఖ	51	373
గిరిజన సంక్షేమ శాఖ	9	46
రెసిడెన్షియల్ పాఠశాలలు	6	333

ఉత్తీర్ణత శాతం తగ్గితే చర్యలు



పదిలో ఉత్తీర్ణత శాతం పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం. అన్ని హాస్టళ్లలో స్టడీ అవర్స్ నిర్వహించడంతో పాటు ట్యూటర్లను నియమించాం. ఈ సారి ఉత్తీర్ణత శాతం తగ్గితే వార్డెన్లు, ఏఎస్‌డబ్ల్యూఓలపై చర్యలు తప్పవు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంక్రిమెంట్లు నిలిపివేయడంతో పాటు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం. ప్రతి వార్డెన్ స్థానికంగా నివాసం ఉండటంతో పాటు సమయపాలన పాటించాల్సిందే.

– విశ్వమోహన్‌రెడ్డి, డీడీ, సాంఘిక సంక్షేమశాఖ

సర్వేయర్ అక్రమాలపై విచారణ



సర్వేయర్ రహబాషాను విచారిస్తున్న డీఐ వేణుగోపాల్ గుప్తా

కూడేరు: మండల సర్వేయర్ రహబాషా అక్రమాలపై కూడేరు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. సర్వేయర్ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వెళ్లడంతో 2022 డిసెంబర్ 30న రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ సస్పెండ్ చేసిన విషయం విదితమే. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ తన కుమారుల పేరిట ఇప్పేరు పొలం సర్వే నంబర్ 700–1లో 3–50 సెంట్ల అసైన్డ్ భూమిని రిజ్వాన్ పేరిట, కలగళ్లలో సర్వేనంబర్ 356–28లో 5 ఎకరాల అసైన్డ్ భూమిని ఖలీల్ అహమ్మద్ పేరిట చేయించుకున్నాడన్న ఫిర్యాదులపై ఆయా గ్రామాల వీర్వోలు రవికాంత్, సేతుమాధవ్‌లను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ (డీఐ) వేణుగోపాల్ గుప్తా, సూపరింటెండెంట్ అయూబ్ ఖాన్‌లు విచారించారు. రెవెన్యూ రికార్డుల్లో ఆ పేర్ల మీదే భూమి ఉన్నట్లు వీఆర్వోలు వివరించారు. రాజేష్, మరికొంత మంది సర్వేయర్ అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపిస్తూ అందుకు సంబంధించి ఆధారాలను పేపర్ మూలకంగా, వీడియోల రూపంలో అందజేశారు. విచారణాధికారులు వాటిని నమోదు చేసుకొన్నారు. అసైన్డ్ భూమి ఏవిధంగా పొందారో సర్వేయర్ కుమారులతో విచారించారు. చివరగా సర్వేయర్‌తో విచారణ జరిపి వివరాలు నమోదు చేసుకొన్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ వివరాలను నివేదిక రూపంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్‌కు పంపుతామన్నారు. ఆయన తదుపరి చర్యలు తీసుకుంటారని తెలిపారు.

కాపర్ల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న పసుపుల నరసింహగౌడ్

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వ ప్రోత్సాహంతో కాపర్ల సంక్షేమానికి కృషి చేస్తామని గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాల సమాఖ్య (షీప్ అండ్ గోట్ జిల్లా యూనియన్) త్రీమెన్ కమిటీ చైర్మన్ పసుపుల నరసింహగౌడ్ తెలిపారు. మంగళవారం స్థానిక పశుశాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న యూనియన్ కార్యాలయంలో పశుశాఖ గొర్రెల అభివృద్ధి విభాగం ఏడీ డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి అధ్యక్షతన వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహగౌడ్ మాట్లాడుతూ.. గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కాపర్ల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు కట్టుబడిందన్నారు. నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) ద్వారా మరింత ఎక్కువగా రుణాలు మంజూరయ్యేలా చూస్తామని తెలిపారు. ఇప్పటి వరకు తీసుకున్న ఎన్‌సీడీసీ రుణాలకు సంబంధించి రికవరీలు పెంచితే భవిష్యత్తులో ఎక్కువ మొత్తంలో మంజూరవుతాయన్నారు. సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని, ప్రభుత్వం వివిధ రకాల వ్యాధుల నివారణకు అమలు చేస్తున్న ఉచిత వ్యాక్సినేషన్ల కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు చాలా మంది సభ్యులు ఆసక్తి చూపగా, ఎన్నికలు జరిగే దాకా త్రీమెన్ కమిటీకి సహకరించాలని కోరారు. త్రీమెన్ కమిటీ సభ్యులు పి.ఈశ్వరయ్య, బి.కిష్టప్ప, డాక్టర్ గోల్డ్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటుకు స్థల పరిశీలన



బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కూడేరు: మండల పరిధిలోని పీఏబీఆర్ వద్ద శాటిలైట్ తిలోఫియా ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటుకు మత్స్యశాఖ అధికారులు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ నెల 18న మత్స్యశాఖ మంత్రి అప్పలరాజు, కమిషనర్ కన్నబాబును విజయవాడలో బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమణ కలిసి పనులు ప్రారంభించేలా చూడాలని విన్నవించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మంత్రి ఆదేశాల మేరకు అధికారులు పీఏబీఆర్ డ్యాంను సందర్శించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు (విజయవాడ) హీరా నాయక్, జిల్లా ఉప సంచాలకురాలు శాంతి మాట్లాడుతూ సెంటర్ ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా డైరెక్టర్ నుంచి వచ్చిన టెక్నీషియన్స్‌ను ఆదేశించారు. పనులు చురుగ్గా చేపట్టడానికి అనుసరించాల్సిన సాంకేతిక విధానాలపై సంయుక్త సంచాలకులు టీబీపీ హెచ్‌ఎల్‌సీ ఇంజినీర్లకు దిశా నిర్దేశం చేశారు. సెంటర్ ఏర్పాటులో జాప్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో రాజీసీఏ, సాంకేతిక ఇంజినీర్లు అప్పల నాయుడు, దీపన్, ఫిషరీస్ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ, ఈఈ శ్రీనివాసులు, డీఈ గురువయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తాడిపత్రి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మండల పరిధిలోని బొందలదిన్నె వద్ద మంగళవారం జరిగింది. వివరాలు.. బొందలదిన్నె గ్రామానికి చెందిన కోటా ప్రతాప్‌రెడ్డి (42) మంగళవారం వంగనూరు గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బొందలదిన్నె వద్ద ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయాడు. అదే సమయంలో కడప వైపు నుంచి తాడిపత్రి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొన్నాడు. తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇన్‌చార్జ్ జీసీడీఓగా శాంతాబాయి



రాప్తాడురూరల్: గార్లదిన్నె మండలం కొప్పలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న శాంతాబాయి సమగ్ర శిక్ష ఇన్చార్జ్ జీసీడీఓగా శాంతాబాయి నియమితులయ్యారు. ఆమె మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

యాడికి: అక్రమంగా తరలిస్తున్న 40 ప్యాకెట్ల (2 టన్నులు) రేషన్ బియ్యాన్ని మండల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపిన మేరకు.. ముందస్తు సమాచారంతో మంగళవారం చిక్కేపల్లె రహదారి వద్ద పోలీసులు కాపు కాశారు. బొలెరో వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి, యల్లనూరు మండలానికి చెందిన ఓబులేసుపై కేసు నమోదు చేశారు.

తొలిసారి స్క్రైబ్స్ లేకుండా..

- ల్యాప్‌టాప్ ఆధారంగా ‘పది’ పరీక్షలు రాయనున్న అంధ విద్యార్థులు



ల్యాప్‌టాప్ ద్వారా పరీక్షలు రాయనున్న విద్యార్థులు

రాప్తాడు రూరల్: అంధ విద్యార్థులు పరీక్షలు రాయాలంటే కచ్చితంగా స్క్రైబ్స్ (సహాయకారి) అవసరం. అంధ విద్యార్థులు జవాబులు చెబితే స్క్రైబ్స్ రాసేవారు. అయితే రాష్ట్రంలో తొలిసారి అంధ విద్యార్థులు స్క్రైబ్స్ అవసరం లేకుండా సొంతంగా ల్యాప్‌టాప్ ద్వారా పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఏప్రిల్ 3 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల్లో ఆర్డీటీ నిర్వహిస్తున్న అంధ స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఈ విధంగా రాసేందుకు ముందుకొచ్చారు. ఎక్కలూరు దివ్యశ్రీ, పొలిమేర చైత్రిక, ఏకుల సౌమ్య, మేకా శ్రీధాత్రి, ఉప్పర నాగరత్నమ్మ, చంచుగారి పావని ల్యాప్‌టాప్ ద్వారాజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో పరీక్షలు రాయనున్నారు. వీరి పరీక్షలకు డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ నుంచి అనుమతులు కూడా వచ్చాయి. ఇప్పటికే విద్యాశాఖ అధికారులకు పరీక్ష రాసే విధానంపై డెమో కూడా ఇచ్చారు.

ముందుగా ప్రశ్నలన్నీ ల్యాప్‌టాప్‌లోకి...

పరీక్షల సమయంలో ముందుగా ఇన్విజిలేటర్ ఆయా విద్యార్థులకు ప్రశ్నపత్రంలోని ప్రశ్నలు చెప్పగానే ల్యాప్‌టాప్‌లోకి ఎక్కించుకుంటారు. వారికి అర్థమయ్యేలా చిన్నశబ్దం వస్తుంది. ఈ శబ్దం ఆధారంగానే ఇది ఫలానా ప్రశ్న అని వారికి అర్థమవుతుంది. ఆ ప్రశ్నకు అవసరమైన జవాబును ల్యాప్‌టాప్‌లోనే పొందుపరుస్తారు. ఇలా అన్ని ప్రశ్నలకూ జవాబులు రాయడం పూర్తయిన తర్వాత ల్యాప్‌టాప్ నుంచి వారు రాసిన జవాబు పత్రాలను డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీస్తారు. ఆ హార్డ్‌కాపీలకు ఓఎంఆర్ షీటును జతచేసి మూల్యాంకనానికి పంపుతారు. ప్రతి పరీక్షలోనూ ఇదే విధంగా చేస్తారు. డీఈఓ ఎం.సాయిరామ్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ మాట్లాడుతూ ఆర్డీటీ స్కూల్‌లో మొత్తం 63 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారన్నారు. వారిలో ఆరుగురు విద్యార్థులు ల్యాప్‌టాప్ ద్వారా పరీక్షలు రాయనున్నారు. తక్కినవారందరికీ స్క్రైబ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ల్యాప్‌టాప్ ద్వారా పరీక్షలు రాసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాల అభ్యున్నతి



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, చిత్రంలో పైలా, హుస్సేన్‌పీరా తదితరులు

అనంతపురం క్రైం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా ఆధ్వర్యంలో ట్రేడ్ యూనియన్ పార్టీ జెండా ఆవిష్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగన్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించి మరోసారి వైఎస్ జగన్‌ను సీఎంని చేసుకుందామని పిలుపునిచ్చారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచి జీవితాల్లో వెలుగులు నింపారని మేయర్ వసీం అన్నారు. ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 1,35,000 మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో నాటక అకాడమీ రాష్ట్ర చైర్‌పర్సన్ హరిత, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ అనుబంధ బీసీ సెల్ జోనల్ కార్యదర్శి రమేష్‌గౌడ్, అనుబంధ విభాగం జిల్లా అధ్యక్షులు సైపుల్లాబేగ్, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, పార్టీ నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, కార్పొరేటర్ కమల్‌భూషణ్, నాయకులు అనిల్‌కుమార్‌గౌడ్, కొండమ్మ పరమేష్, శోభారాణి, రాధా యాదవ్, భారతి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వృషభాల బల ప్రదర్శన పోటీలు రేపు

రాప్తాడు: రాప్తాడులో ఈ నెల 30న రాష్ట్ర స్థాయి వృషభాల బల ప్రదర్శన (రాతి దూలం లాగుడు) పోటీలు నిర్వహిస్తున్నట్లు లక్ష్మీ పండమేటి రాయుడు ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎద్దుల యజమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రూ.60 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి ఎమ్మెల్యే సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి రూ.50 వేలు, తృతీయ స్థానం –ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ రూ.40 వేలు, నాల్గో స్థానం – జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి రూ.30 వేలు, ఐదో స్థానం–ఆలయ కమిటీ అధ్యక్షుడు గంజి రాముడు రూ.20 వేలు పంపిణీ చేస్తారని తెలిపారు. పాల్గొనదలచిన వారు 81069 46853, 9440088531, 8639828818 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

క్లుప్తంగా

పంట కోత ప్రయోగాలు

ఆత్మకూరు: వడ్డుపల్లిలో వ్యవసాయ సిబ్బంది రబీలో బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంట కోత ప్రయోగాలు చేశారు. దిగుబడిని తూకం వేసి ఉన్నతాధికారులకు పంపుతామని ఏఈఓ సుజిత తెలిపారు. మండలంలో ఈకేవైసీ చేయించని రైతులు ఉన్నారని, వెంటనే ఈకేవైసీ చేయిస్తే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందుతాయన్నారు.

పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్, ఎంఈఓ నరసింహారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఏప్రిల్ 3 నుంచి పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు తాగు నీరు, మరుగుదొడ్ల, బల్లలు, కుర్చీల సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

31న రాతిదూలం లాగుడు పోటీలు

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లిలో ఈ నెల 31న శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. వారు మాట్లాడుతూ సీనియర్ విభాగంలో ఈ పోటీలు ఉంటాయని, మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ. 30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గో బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 6303244061, 9493500460లో సంప్రదించాలన్నారు.

5న చలో ఢిల్లీ

ఆత్మకూరు: ఏప్రిల్ 5న ఢిల్లీలో జరగనున్న కార్మిక, కర్షక ప్రదర్శనకు తరలిరావాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆత్మకూరులో చలో ఢిల్లీ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షురాలు జయమ్మ, రమాదేవి, నాయకులు శివశంకర్, మీనాక్షి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవ పోస్టర్ల విడుదల


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్: స్థానిక శ్రీనివాసనగర్‌లోని శ్రీసీతారామాంజనేయ దేవస్థానంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా గురువారం నిర్వహించనున్న సీతారామ కల్యాణోత్సవం, రథోత్సవ వేడుకల పోస్టర్లను ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డరాము, అధ్యక్షుడు రామప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో ఉదయం నుంచి రాత్రి ఊంజల సేవ వరకు పెద్ద ఎత్తున కార్యక్రమాలుంటాయని, భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

సమ్మర్ కోచింగ్ క్యాంపులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మర్ కోచింగ్ క్యాంపులకు దరఖాస్తు చేసుకోవాలని ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 08554-353223 నంబరులో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి


ఆసరా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


ఆసరా కార్యక్రమానికి హాజరైన మహిళలు

- ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి
- 'ఆసరా' వారోత్సవ సభలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని, పేదవాడికి ఆర్థిక పరిపుష్టి కలిగించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు విరివిగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగర శివారులోని గుత్తిరోడ్డు విద్యుత్ కళాభారతిలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాల సభ నిర్వహించారు. నగరంలోని 1 నుంచి 15 సచివాలయాల పరిధిలోని 677 సంఘాలకు రూ.4.99 కోట్ల చెక్కును ఎమ్మెల్యే అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, వివిధ


ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

పథకాల రూపంలో మూడున్నరేళ్లలో రూ.1,85,000 కోట్లు ఖాతాల్లో జమ చేశారన్నారు. అనంతపురం నియోజకవర్గంలోని అర్బన్, నాలుగు పంచాయతీల్లోని 2,527 సంఘాలకు మూడో విడత రూ.25.66 కోట్ల ఆసరా డబ్బులు మహిళల ఖాతాల్లో జమవుతున్నాయన్నారు. ఇప్పటి వరకు అనంతపురం జిల్లాలో ఆసరా డబ్బులు 236.66 కోట్లు అందిస్తుంటే.. ఒక్క అనంతపురం నియోజకవర్గంలో మూడు విడతల్లో రూ.75 కోట్లు విడుదల చేసిన ఘనత తమ ప్రభుత్వానిదని చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధి చేసి ఓట్లు అభ్యర్థిస్తాం

నవరత్నాల ద్వారా పేదలకు ఇళ్లు, చేయూత, ఆసరా తదితర సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. టీడీపీ హయాంలో ఎమ్మెల్యే, ఎంపీ, మేయర్ వర్గపోరుతో ఒక్క రోడ్డు నిర్మించలేదని, గుంతలకు మట్టి వేసిన పాపానపోలేదన్నారు. తమ ప్రభుత్వంలో కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రజలను ఆదుకుందన్నారు. నగరంలో గుత్తి రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, క్లాక్‌టవర్ బ్రిడ్జ్ ఫోర్ వే, తదితర అభివృద్ధి పనులకు రూ.800 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. క్లాక్‌టవర్ బ్రిడ్జ్‌ను మరో 40 రోజుల్లో రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నగరంలో కాలువలు, అంతర్గత రోడ్ల ఏర్పాటుకు సీఎం రూ.25 కోట్లు మంజూరు చేశారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా ప్రతి సచివాలయ పరిధిలో రూ.20లక్షల చొప్పున నియోజకవర్గంలోని 85 సచివాలయాల పరిధిలో రూ.17 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి చేసే వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఓట్లు అభ్యర్థించేందుకు వస్తామని, మీరందరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వం చేసిన మోసాలను మేయర్ వసీం వివరించారు. అర్బన్ ప్రాంతంలో మూడు విడతల్లో రూ.60 కోట్లకుపైగా సభ్యుల ఖాతాల్లో జమ అయ్యిందని మెప్మా పీడీ విజయలక్ష్మి పేర్కొన్నారు. చిన్నారులు ఓజేశ్వరి, భవిష్యసాయి చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, కార్పొరేటర్లు లాలూ, లక్ష్మి, లక్ష్మీదేవి, సుమతి, కమల్‌భూషణ్, అనుబంధ సంఘాల అధ్యక్షుడు సైపుల్లాబేగ్, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు వేగవంతం చేయండి


నడిమివంకలో పీఏబీఆర్ పైప్‌లైన్ మార్పు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం క్రైం: నడిమివంక రోడ్డు పనుల్లో భాగంగా పీఏబీఆర్ పైప్‌లైన్ మార్పు పనులను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మంగళవారం పరిశీలించారు. పైప్‌లైన్ పనులను వేగవంతం చేసి నగర ప్రజలకు సాధ్యమైనంత త్వరగా నీరందించేందుకు చర్యలు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. వేసవి కాలంలో ప్రజలు అవస్థలు పడకుండా ట్యాంకర్ల ద్వారా నీరందించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రమణారెడ్డిని ఆదేశించారు. దీంతో కమిషనర్ ఆదేశాలతో నీటి సరఫరా విభాగం డీఈ నరసింహ వివిధ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయించారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, నాయకులు చింతకుంట మధు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీని కలిసిన సచివాలయ ఉద్యోగులు

అనంతపురం క్రైం: మున్సిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తిని ఆయన కార్యాలయంలో సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు(ఏపీవీడబ్ల్యూఎస్ జీఈఎస్) మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 2020-21 రెండో నోటిఫికేషన్ ద్వారా నియామకమైన గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబంధించి ప్రొబేషన్ డిక్లరేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని వారు ఆర్డీకి విన్నవించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు శివశంకరయ్య, మహేష్ నాయక్, హనుమంతు, వెంకటరామిరెడ్డి, చిరంజీవి, శ్రీనివాస్‌రెడ్డి, బయన్న, ములకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: రాయలసీమ అభివృద్ధికి అక్షర యజ్ఞం చేసిన దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి ఎందరికో ఆదర్శమని పలువురు వక్తలు, జర్నలిస్టులు యూనియన్ నాయకులు కొనియాడారు. ఇటీవల మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు, ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్, దివంగత దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సంస్మరణ సభను స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏపీడబ్ల్యూజే జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వీకే రంగారెడ్డి మాట్లాడుతూ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి రాయలసీమ వాసిగా , ఈ ప్రాంత కరువుపైనా, ప్రాజెక్టులు, సాగునీటి సమస్యలు, సామాజిక సమస్యలపై అధ్యయనం చేసి, అక్షర సమరం చేశారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, మైసూరారెడ్డితో అత్యంత సన్నిహితంగా ఉండేవారన్నారు. రాజకీయాలకతీతంగా కథనాలు రాశారన్నారు. అలాంటి వ్యక్తిని నేటి జర్నలిస్టులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు మంజునాథ్, పయ్యావుల ప్రవీణ్, ప్రభాకర్ నాయుడు, సనప రామకృష్ణ, చౌడప్ప, చలపతి, ప్రదీప్ కుమార్‌రెడ్డి, లోకరాజు, వేణుగోపాల్, ఆనంద్ వర్ధన్, మల్లికార్జున శర్మ, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యాభివృద్ధికి పెద్దపీట

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: బాలికల బంగారు భవిష్యత్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. నగరంలోని వేణుగోపాల్‌నగర్‌లోని ఓ రెసిడెన్సి కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామీణ ప్రాంత బాలికలకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవానికి జెడ్పీచైర్‌పర్సన్ హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 'అమ్మాయి చదువు - అవనికి వెలుగు' అని సీఎం జగన్ గుర్తించారన్నారు. బాలికలు ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువుకోగలరని భావించి పౌష్టికాహారం అందించడంతో పాటు రక్తహీనత సమస్యలను అధిగమించేలా అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించారన్నారు. అనంతరం చదువులో ప్రతిభ కనబరిచిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన వంద మంది విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందించారు.


ప్రశంసాపత్రం అందిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ

ఆర్థికసాయం..

నగరంలోని మున్నానగర్‌కు చెందిన నబీరసూల్ కుటుంబానికి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మంగళవారం ఆర్థికసాయం అందించారు. నబీరసూల్ నోటి కేన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మందులు కొనలేని పరిస్థితి. నబీరసూల్ తన భార్య మహబూబ్‌జాన్‌తో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసి ఆర్థికసాయం చేయాలని కోరారు. సామాజిక కార్యకర్త షేక్ నిజాం, గౌస్, మానవ హక్కుల సంఘం ప్రతినిధి మసూద్ వలి పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్

అనంతపురం: ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి పేర్కొన్నారు. డాక్టర్ ఆదిశేషారెడ్డి రాసిన ' ఉన్నత విద్యలో ముస్లిం విద్యార్థుల స్థితి ' అనే పుస్తకాన్ని వీసీ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ముస్లింలు ఉన్నత విద్యను అభ్యసించడానికి, తద్వారా జీవితంలో రాణించడానికి తోడ్పడిన అంశాలను సమగ్రంగా పుస్తకంలో వివరించారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏ మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ, ప్రొఫెసర్ మునినారాయణప్ప, డాక్టర్ ఎం. శ్రీరాములు, పుస్తక రచయిత డాక్టర్ ఆదిశేషా రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎస్కేయూ వీసీ జన్మదిన వేడుకలు

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ మాచిరెడ్డి


కేక్ కట్ చేస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి

రామకృష్ణా రెడ్డి 66వ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వీసీతో కేక్ కట్ చేయించి, సంబరాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు తిప్పలూరి సుధీర్‌రెడ్డి, విద్యార్థి నాయకులు పి.హేమంత్ కుమార్, సునీల్, తేజేశ్వరరెడ్డి, శివ, బాబా, మోహిత్, నితిన్ రెడ్డి, రమేష్, నెహమ్య పాల్గొన్నారు.

చైతన్య స్కూల్‌లో నేరతాన్, అబాకస్ పోటీలు

రాప్తాడురూరల్: నగరంలోని కోర్టురోడ్డులో ఉన్న చైతన్య పాఠశాలలో జోనల్ స్థాయి నేరతాన్, అబాకస్ పోటీలు మంగళవారం జరిగాయి. పోటీలను చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి, డాక్టర్ వెంకటరమణ, ఆనంద్ దంపెల్ల ప్రారంభించారు. అనంతపురం జోన్ పరిధిలోని చైతన్య విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, ప్రైమరీ విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 1 నుంచి ఐదోతరగతి వరకు ఆరు నిమిషాల వ్యవధిలో 100 ప్రశ్నలకు సమాధానాలు


సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

రాయగలగాలి. ఇందులో బ్రాంచ్‌కి ముగ్గురు చొప్పున విద్యార్థులు ఎంపికయ్యారు. నేరతాన్‌కు సంబంధించి ఆంగ్లభాషలో విద్యార్థుల డ్రామా స్టోరీ టెల్లింగ్ అన్ని బ్రాంచీల విద్యార్థుల మధ్య పోటా జరిగింది. ఇందులోనూ బ్రాంచ్‌కు ముగ్గురు చొప్పున విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు మెమొంటోలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు తబస్సుమ్, శాంత, పర్వీన్, నేత్రావతి, శ్రీదేవి ఫిలిప్‌బాబు, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజ, ప్రీ ప్రైమరీ జోనల్ ఇన్‌చార్జ్ సబిత, ఆర్ట్ టీచర్లు మధు, అఫ్రీన్, అశ్విని, ప్రైమరీ ఇన్‌చార్జ్ నీరజ, భారతి, చంద్రకళ పాల్గొన్నారు.

అలంకరణలో కోదండరామాలయం

అనంతపురం కల్చరల్: స్థానిక సున్నపుగేరిలోని కోదండరామాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మంగళవారం ఆలయాన్ని, పరిసరాలను విద్యుత్ దీప కాంతులతో అలంకరించారు. ఈవో రామాంజనేయులు మాట్లాడుతూ గురువారం శ్రీరామనవమి పండగ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. సాయంత్రం జరిగే ఉట్ల పరుష, గ్రామోత్సవానికి పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: స్థానిక కేజీబీవీలో 6,7,8 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ వెంకటలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆరోతరగతిలో 40, ఏడోతరగతిలో 1, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

విజయ్‌సాయికి అంతర్జాతీయ అవార్డు

అనంతపురం కల్చరల్: సామాజిక సేవా కార్యకర్త విజయ్‌సాయి అంతర్జాతీయ అవార్డు అందుకున్నాడు. అమెరికన్ యూనివర్సిటీ ఫర్ గ్లోబల్‌పీస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వ్యక్తులకు ఇచ్చే 'అంతర్జాతీయ బెస్ట్ అవార్డు'ను విజయ్‌సాయికి అందించారు. బెంగళూరులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విజయ్‌సాయికి యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ ప్రతిమ, జాసన్‌చా, లిసాకిమ్, మధుకిషన్ తదితరుల అందించారు.

ఎస్పీని కలిసిన విజిలెన్స్ ఎస్పీ


ఎస్పీని కలసిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎస్పీ డాక్టర్ కె.ఫక్కీరప్పను కర్నూలు, అనంతపురం జిల్లాల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జ్ ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వర రెడ్డి మంగళవారం కలిశారు. ఎస్పీ చాంబర్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే ఐపీఎస్‌గా కన్ఫర్మ్ కావడంతో ఎస్పీని కలిశానని ఆయన తెలిపారు. ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డికి అనంతపురం ఎస్పీ శుభాకాంక్షలు తెలియజేశారు.

నడిమి వంక సర్వేకు చర్యలు

అనంతపురం క్రైం: నగరంలోని 48వ డివిజన్ పరిధిలోని గౌరవగార్డెన్, వడ్డేవారి కాలనీ, తదితర ప్రాంతాల్లో కమిషనర్ రమణారెడ్డి, ఏసీపీ శ్రీనివాసులు రెడ్డి, సర్వేయర్ మంగళవారం పర్యటించారు. గతేడాది అకాల వర్షాలతో నడిమివంకకు ఆనుకొని ఉన్న 4,5, 6వ రోడ్లు, శాంతినగర్, గౌరవగార్డెన్, రజక నగర్, రంగస్వామి నగర్, వడ్డే వారి కాలనీ, సోమనాథ్‌నగర్ తదితర ప్రాంతాల్లోకి వరదనీరు వచ్చింది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నిర్వాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బుధవారం డ్రోన్ ద్వారా సర్వే చేయాలని కమిషనర్ రమణారెడ్డి ఏసీపీ శ్రీనివాసులు రెడ్డి, సర్వే బృందాన్ని ఆదేశించారు. ఈఈ చంద్రశేఖర్, డీఈ రాంప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త రహిత నగరమే లక్ష్యం

చెత్త రహిత నగరమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కమిషనర్ రమణారెడ్డి పారిశుద్ధ్య కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం నగర పాలక సంస్థలో ప్రజారోగ్యాధికారులు, పారిశుద్ధ్య కార్యదర్శులు, హెల్త్ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. చెత్తను వేరు చేసి ఇచ్చేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. క్లాప్ ఆటోల్లో చెత్త వేర్వేరుగా తీసుకెళ్లేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తే చర్యలు తప్పవన్నారు. ఆరోగ్య కార్యదర్శులు ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

దుష్ప్రచారం తగదు

రాప్తాడురూరల్: రూరల్ మండలం కొడిమి వద్ద ఓ రైతు భూమిని అధికార పార్టీ నాయకులు లాక్కునేందుకు ప్రయత్నించారని ఎల్లో మీడియా, టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారం తగదని వైఎస్సార్ సీపీ రూరల్ మండల కన్వీనర్లు బండి పవన్‌కుమార్, దుగుమర్రి గోవిందరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం అనంతపురం మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు గుజ్జల ఈశ్వరయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొడిమి పొలంలో 40 ఎకరాలకుపైగా అసైన్డ్ కమిటీ ఆమోదం లేకుండా టీడీపీ హయాంలో సాగు పట్టాలు తెచ్చుకున్నారన్నారు. జగనన్న ఇళ్ల కోసం ఈ పట్టాలన్నీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఈ భూములను ఎవరో శుభ్రం చేస్తున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి వచ్చిందని, ఆయన రెవెన్యూ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. వారు సదరు రైతుకు సంబంధించిన రికార్డులు పరిశీలిస్తున్నారన్నారు. ఎమ్మెల్యేను బదనాం చేసేలా మాట్లాడినా, ఎల్లో మీడియాలో రాతలు రాయించినా గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

ఒత్తిడి వీడితేనే ఉత్తమ ఫలితాలు

- ఏప్రిల్ 3 నుంచి పదోతరగతి పబ్లిక్ పరీక్షలు
- భయం వీడేలా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణ
- ప్రణాళికబద్ధంగా చదవాలంటున్న విద్యా నిపుణులు


ఏపీ మోడల్ స్కూల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

రాప్తాడు: విద్యార్థులకు పదో తరగతి ప్రత్యేకం. మంచి మార్కులతో ఉత్తీర్ణులైతే ఆత్మవిశ్వాసం రెట్టింపవుతుంది. ప్రతి విద్యార్థి టెన్త్ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలి. ప్రతి సబ్జెక్టును రివిజన్ చేసుకుంటే విజయం సులువవుతుంది. విద్యార్థులు ఒత్తిడికిలోను కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 42 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో 1,983 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వచ్చే ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయని షెడ్యూల్ విడుదలైంది. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పాఠశాలల్లో ఉదయం పూట, సాయంత్రం పూట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు ఎలా సన్నద్ధమవాలో శిక్షణ ఇస్తున్నారు. స్వయంగా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పరీక్షల ఆశ్యకతను వివరిస్తున్నారు. మొబైల్ గేమ్స్, సోషల్ మీడియా పోస్టులు, కొత్త సినిమా కబుర్లు, క్రికెట్ మ్యాచ్‌ల జోలికెళ్లకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిస్తున్నారు. నేర్చుకున్న పాఠాలను ప్రణాళికబద్ధంగా పునశ్చరణ చేసుకోవాలని చెప్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

ప్రత్యేక తరగతులు పర్యవేక్షిస్తున్నాం



ప్రతి హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్, ఎంపీడీఓలతో కలిసి పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్నాం. జిల్లా విద్యాధికారి ఇచ్చిన 60 రోజుల కార్యాచరణను అమలు చేస్తున్నాం. పదో తరగతి విద్యార్థులను ఏ,బీ,సీ,డీ గ్రూపులుగా విభజించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. వంద శాతం ఉత్తీర్ణకు కృషి చేస్తున్నాం.

– మల్లికార్జున, ఎంఈఓ, రాప్తాడు

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

సమ్మెటివ్ పరీక్షలు పూర్తికావడంతో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. పరీక్షల ఒత్తిడిలో విద్యార్థులు పొరపాట్లు చేయకుండా సులభ పద్ధతిలో మంచి మార్కులు ఎలా సాధించాలన్న అంశంపై ప్రత్యేక తరగతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. మాదిరి పరీక్షలు పెట్టి, విద్యార్థుల్లో పరీక్షలంటే ఉండే భయాన్ని తొలగించడానికి కృషి చేస్తున్నాం.



– పద్మజాదేవి, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్, రాప్తాడు

ఆస్పత్రికి కంప్యూటర్ ప్రింటర్ వితరణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆస్పత్రి అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమని సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ ఆకాంక్షించారు. స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఫార్మసీ విభాగానికి రూ. 16 వేలు విలువ చేసే ప్రింటర్‌ను ఆస్పత్రి జనరల్ సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివశంకర్‌నాయక్ అందించారు. డాక్టర్ శివశంకర్ నాయక్ మాట్లాడుతూ ఆస్పత్రికి తన వంతు బాధ్యతగా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసీ విభాగం కేవీఆర్ మూర్తి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.